

ఆధార్ కోసం అవస్థలు

డోలీలో వృద్ధురాలిని బ్యాంకుకు తరలించిన బంధువులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో ఏనుగు రాయి పంచాయతీ కిమ్మలమామిడి గ్రామానికి చెందిన కొర్ర బిమల (80) ఆధార్ అప్డేట్ చేయించేందుకు అనేక కష్టాలకు గురైంది. గ్రామం నుండి వనుగుపుట్టు జంక్షన్ వరకు సుమారు మూడు కిలోమీటర్లు మార్గంలో రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. గ్రామం నుండి ముంచింగి పుట్టు వెళ్ళుటకు రవాణా సౌకర్యం లేదు. దీంతో బిమలను డోలి మోతతో మండల కేంద్రం వరకు ఐదు కిలోమీటర్ల మేర కుటుంబ సభ్యులు మోసుకుని తీసుకువచ్చి ఆధార్ అప్డేట్ కోసం స్టేట్ బ్యాంకుకు అష్ట కష్టాలు పడి తీసుకొచ్చారు.



డోలీలో తరలిస్తున్న బంధువులు

బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి నవీన్ మృతిపై

విద్యార్థి సంఘాలు, బంధువుల ఆందోళన

▸▸ కుమారుడిది హత్యే : తల్లిదండ్రులు ▸▸ మృతదేహానికి జరగని పోస్ట్‌మార్టం ▸▸ అనుమానితులపై పోలీసుల దర్యాప్తు



ఆందోళన చేపడుతున్న విద్యార్థి సంఘాల నేతలు, బంధువులు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న పాంగి నవీన్ మృతిపై మిస్టరీ వీడలేదు. అనుమానాస్పద రీతిలో మృతి చెందిన నవీన్ మృతదేహం పాఠశాలకు సమీపంలో బుధవారం సాయంత్రం వెలుగు చూసిన సంగతి తెలిసిందే. నవీన్ మృతదేహాన్ని గత రాత్రి జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించినప్పటికీ గురువారం కూడా పోస్టుమార్టం చేయ లేదు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సెక్షన్ 174 కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసామని పాడేరు సీఐ సుధాకర్ విలేకరులకు తెలిపారు.

విద్యార్థి నవీన్ అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటనపై ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, జిఎస్‌యు విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట గురువారం నవీన్ బంధువులతో కలిసి బైఠాయించారు. దీంతో పాఠశాల వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు దాస్, ఏబీవీపీ జిఎస్‌యు నాయకులు సుమన్, ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ, నవీన్ మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని వాస్తవాలను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి నవీన్ స్వగ్రామమైన జి.మాడుగుల మండలం గెమ్మెలి పంచాయితీ సుర్లపాలెం గ్రామం నుంచి నవీన్ తల్లిదండ్రులతో పాటు బందు వర్గం గ్రామస్తులు భారీగా తరలి వచ్చి పాఠశాల వద్ద మోహరించారు. దీంతో పోలీస్ అధికారులు, సిబ్బంది కూడా పాఠశాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి ఉద్రిక్తత అదుపు తప్పకుండా చర్యలు తీసుకున్నారు.

నవీన్ తండ్రి మహేంద్ర విలేకరులతో మాట్లాడుతూ, తమ కుమారుడును గతేడాది ఈ పాఠశాలలో ఆరవ తరగతిలో చేర్చామని తెలిపారు. రెండు రోజులు సెలవు రావడంతో గత శుక్రవారం ఇంటికి వచ్చి మళ్లీ మంగళవారం పాఠశాలకు వచ్చేసాడని తెలిపారు. బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. తమ కుమారుడిది హత్యేనని తాము భావిస్తున్నామని ప్రభుత్వం నిజాలను గుర్తించి తమకు అన్ని విధాల న్యాయం చేయాలని కోరారు.

విచారణ చేయాలి : సురేంద్ర

ముంచింగిపుట్టు: అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి నవీన్‌పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం



ముంచంగిపుట్టులో ఆందోళన చేపడుతున్న సురేంద్ర, నాయకులు



పాఠశాల వద్ద ఉన్న బంధువులు, స్థానికులు

మండల కార్యాలయం వద్ద సురేంద్ర మాట్లాడుతూ, హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చట్టరీత్యా కేసులు పెట్టి అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి పది లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. గత 6 నెలల్లో 13 మంది విద్యార్థులు మృతి చెందితే ఐటిడిఎ, జిల్లా అధికారులు కనీసం స్పందన లేక పోవడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను, వంతల లైకోన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు డోంబ్రు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వాలి: పృధ్విరాజ్

పెదబయలు : పాంగి నవీన్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పృధ్విరాజ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనతో అధికారులు తలవంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నవీన్ కనిపించకపోతే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లు తల్లిదండ్రులకు తెలియ పరచకపోవడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు శ్రద్ధ వహించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు నాగేశ్వరరావు

ముంపు ప్రాంత రైతుల సమస్యలను పరిష్కరించాలి

రైతు సంఘం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ముంపు ప్రాంత రైతుల సమస్యలను ప్రత్యేక కోణంలో చూసి సానుకూలంగా స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని రేఖపల్లిలో కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన ఏపీ రైతు సంఘం ఐదవ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ముంపు మండలాల్లో రైతులు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయారని, పంటలు వేయలేని స్థితిలో ఉన్నారని, వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. పోలవరం పరిహారం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. రైతులకు ఉచితంగా ఇచ్చే వ్యవసాయ బోర్లకు మీటర్లు అమర్చి ఉచిత విద్యుత్తును ఎత్తేవేసి దుర్మార్గమైన చర్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగుతున్నాయని మండిపడ్డారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో 15 మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘం మండల అధ్యక్షులుగా ఫంకు సత్తిబాబు, కార్యదర్శిగా వడ్లది రమేష్, కమిటీ సభ్యులుగా సీరపు తాతబాబు, సున్నం నాగయ్య, కారం సత్యం, కుకునూరి నాగరాజు, సోయం చినబాబు, చిక్కాల రామారావు, తుర్రం బాబూరావు, సున్నం నాగయ్య, గుహల శ్రీను, దారోగి బాబూరావు, నల్లారపు చంద్రరావు, జల్లి సత్యనారాయణ, ముసలి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల కట్టడికి చర్యలు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరుటౌన్:

జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించకూడదని, వీటి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. అక్టోబర్ నెలలో జరిగిన మాతృ మరణాలకు దారి తీసిన కారణాలపై గురువారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాతా, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మాతృ మరణాలు సంభవించ కూడదని ఒకవేళ జరిగితే పక్కా విశ్లేషణ ఉండాలన్నారు. మరణాలు జరగడానికి సౌకర్యాలలోపమా, వైద్య సేవలు లోపమా, సామాజికపరమైన అంశాలు ఉన్నాయా అనే కారణాలను విశ్లేషించాలని స్పష్టం చేశారు. గర్భిణీలు ప్రసవ సమయంలో మీతి చెందితే అందుకు గల నిర్దిష్టమైన కారణం కనుగొనాలని స్పష్టం చేశారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల పిహెచ్‌సి వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, గైనకాలజిస్టు, పిడియాట్రిషన్, జిల్లా నోడల్ అధికారి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలి : ఎంపిపి లక్ష్మి

ప్రజాశక్తి - విఆర్.పురం

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని ఎంపిపి కారం లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సోములగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మతో కలిసి సందర్శించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉండగా, ఐదుగురు టీచర్లు, ఐదుగురు సీఆర్‌టీలు మాత్రమే ఉన్నారని, ఇలా అయితే వారికి విద్యా బోధన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు పూనం సత్యనారాయణ, సర్పంచ్ పులి సంతోష్ కుమార్, నాయకులు పులి బొజ్జి పాల్గొన్నారు.



పిడిఎస్ సరుకులు స్వాధీనం చేసుకున్న జిల్లా పౌరసరఫరాల అధికారి

ప్రజా పంపిణీ సరుకుల క్రయ, విక్రయాలు నేరం

- జిల్లా పౌర సరఫరాల అధికారి శివ ప్రసాద్

ప్రజాశక్తి - పాడేరు: ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన రేషన్ బియ్యం, ఇతర ఆహార పదార్థాలు కొనుగోలు, అమ్మకాలు చట్ట రీత్యా నేరమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి ఉప తహసిల్దార్ బి. ప్రశాంత్ కుమార్‌తో కలిసి గుత్తులపుట్టు సంతను సందర్శించారు. సంతలో వి.మాడుగుల మండలం ఎం.కోడూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆరు ప్లాస్టిక్ బ్యాగ్స్‌లో 275 కేజీల పిడిఎస్ రైస్ కొనుగోలు చేసినట్లు గుర్తించి బియ్యం, ఎలెక్ట్రానిక్ తూనిక యంత్రం సీజ్ చేశామని డిఎస్ఓ తెలిపారు. ఆ వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

20న యుటిఎఫ్ రాష్ట్ర సదస్సు

- పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 20న పాడేరులో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.కన్నయ్య, అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి కన్నయ్య మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై గత నెల 17 నుంచి 22 వరకు యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా జీపు జాతా నిర్వహించి సమస్యలను సేకరించిందన్నారు. ఆ జతా ద్వారా వచ్చిన సమస్యలపై చర్చించి పరిష్కారానికి పాడేరులోని మోదకొండమ్మ కళ్యాణ మండపంలో రాష్ట్రస్థాయి విద్యా సదస్సు నిర్వహించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులతో పాటు యూటీఎఫ్ నాయకులు 400 మంది పాల్గొం టారన్నారు. ఈ సదస్సుకు గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌టిలు, భాష వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మండల కార్యదర్శి ఆనంద్, నాయకులు ఏం మోహన్, ఎం.చంద్రరావు, ఎం.రామకృష్ణ, ఆర్ మల్లికార్జునరావు, కె.మేఘనాధరాజు పాల్గొన్నారు.

ఉధృత పోరాటాలకు సిద్ధంకండి

అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు బేబీరాణి

ప్రజాశక్తి -రంపచోడవరం

మహాసభల స్ఫూర్తితో నూతనోత్తేజంతో అంగన్వాడీ వర్కర్లు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎంపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబీ రాణి అన్నారు. స్థానిక యుటిఎఫ్ సమావేశ మందిరంలో గురువారం అంగన్వాడీ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రథమ మహాసభ యూనియన్ నాయకురాలు కె.రామలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బేబీరాణి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిందని చెప్పారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలపై ఆందోళ చేస్తున్న కార్మికులు, నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, నిర్బంధాలకు గురి చేస్తుందని తెలిపారు. జిల్లాల విభజన సరిగా జరగకపోవడంతో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అంగన్వాడి వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో బేబీరాణి, పల్లపు వెంకట్

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సున్నం రంగమ్మ, బత్తిన నిర్మల, కోశాధికారిగా కారం రామలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పోడియం సావిత్రి, కొర్రపు రాణి, మడెం అన్నపూర్ణ, కళింకోట వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బండారు సూర్యకుమారి, నడిపూడి రత్నకుమారి, ముసురు రాజేశ్వరి, మరో 17 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ,చంద్రవతి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పూనెం సత్యనారాయణ, కంభం శాంతిరాజు, పుట్ట రామరాజు, కొమరం చెల్లయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపేట గ్రామంలో టిడిపి మండల సర్వసభ్య సమావేశం గురువారం టిడిపి మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్, వైస్ ఎంపీపీ భాగ్యలక్ష్మి, కార్యదర్శి బురక కన్నారావు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి, రామారావు మాట్లాడుతూ ఈ ఏడాది నాలుగు సార్లు వచ్చిన వరదలకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఆస్తి నష్టపోవడం జరిగిందని తెలిపారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని కోరారు. సెటిల్మెంట్ భూమి, అసైన్మెంట్ భూమితో పాటు పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నిర్వాసిత గ్రామాలలో గిరిజనులు 20 ఏళ్ల క్రితం నుండి సాగు చేస్తున్న భూములను గుర్తించి సర్వే చేసి వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి పోలవరం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి కూడా భూ నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఈ మధ్య ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ నోటిఫికేషన్‌లో రామవరం పంచాయతీ రామవరం గ్రామంలో 104 కుటుంబాలు ఇళ్లు పోలవరం ముంపు జాబితాలో లేకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాంబాబు, ముత్యాల సిద్దు, రహీం, భాగ్యలక్ష్మి, బీరక. సూర్య ప్రకాష్ రావు, ముత్యాల చంద్రశేఖర్, సౌలం రాజు, పెందుర్తి బాలాజీ, గొర్రె వెంకటేశ్వర్లు, రేవు సింహాచలం, పెట్టా రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జెడ్‌పిటిసి రంగారెడ్డి, టిడిపి నాయకులు



పతకాలు చూపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

రెవెన్యూ క్రీడల్లో ఉద్యోగుల ప్రతిభ

ప్రజాశక్తి -రంపచోడవరం

ఈ నెల 11 నుండి 14 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో రంపచోడవరం డివిజన్ ఉద్యోగులు ప్రతిభ కనబర్చారు. అథ్లెటిక్స్ 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో షార్ట్ పుట్, డిస్కస్-త్రోలో కాంస్య పతకాలను స్థానిక సబ్-కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు కొలిపే విక్టర్ పాల్, ఎ.పాల్ బాబు సాధించారు. మహిళల డిస్కస్ త్రోలో కాంస్య పతకం, జావెలిన్ త్రోలో వెండి పతకం ఎలక్షన్ సీనియర్ సహాయకులు ఇందిరా బాయి గెలుచుకున్నారు. త్రో బాల్, టగ్ ఆఫ్ వార్ నందు ద్వితీయ బహుమతులను తూర్పుగోదావరి జిల్లా సిబ్బందితో కలిసి రంపచోడవరం మండల రెవెన్యూ కార్యాలయ సిబ్బంది టి.చింతాలమ్మ కె.మల్లమ్మ ద్వితీయ బహుమతులు పొందారు. ఈ క్రీడల్లో చుక్క చంటి, ఎం.ఆనందీశ్వరావు కె.శివ కుమార్, ఎస్.పవనేంద్రకుమార్, బి.గంగరాజు, ఎం.కేశవ చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రీడల్లో పతకాలు సాధించిన వారిని సబ్ కలెక్టర్ శుభం బన్సాల్, తహశీల్దారు పిఎన్‌వి.ప్రసాద్, రంపచోడవరం డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ సెక్రటరీ ఎమ్‌డి పాషా (అక్రం) ప్రత్యేకంగా అభినందించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం, వాణిజ్య శాస్త్రం (కామర్స్) విభాగాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైన తెలిపిన ఆయా విభాగాల్లో పిజిలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. యుజిసి నెట్, ఎపిసెట్, పిహెచ్‌డి అదనపు అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అర్హతలు, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ 21లోగా కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9949229236, 9704762438 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- అడ్డతీగల : స్థానిక సాక్షి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ గురువారం సాక్షి ట్రైనింగ్ సెంటర్‌లో వృద్ధులు, వికలాంగులకు పింఛను పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఆరోగ్య రాజు మాట్లాడుతూ మదర్ థెరిసా వెల్ఫేర్ సొసైటీ వారు 25 మందికి రూ.200 చొప్పున పింఛను ఇవ్వగా, తమ సంస్థ భోజనాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రంలో సాక్షి సుచిత్ర సేవా సంస్థ ట్రెజరర్ పి.లక్ష్మి, బుద్ధ మెర్సీ, శ్యామ్ పాల్గొన్నారు.



పింఛను అందజేస్తున్న ఆరోగ్య రాజు

వాలంటీర్ల నియామకం


నియామక పత్రం ఇస్తున్న వైఎస్ ఎంపిపి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ : మండలంలోని కించుమండ పంచాయితీ పరిధి 6వ క్లస్టర్ వాలంటీర్ బంటు శ్రావ్యకు గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నగేష్, వైస్ ఎంపీపీ ఆనందరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు గుర్తించి వారికి సకాలంలో అందే విధంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సింహాచలం, సిహెచ్ మల్లేష్ పాల్గొన్నారు.

జిమ్సర్‌లో జాతీయ 'ఎపిలిప్సీ డే'



మూర్ఛరోగులకు కిట్లు అందజేస్తున్న జిమ్సర్ వైద్యులు

ప్రజాశక్తి- మధురవాడ: గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఎపిలిప్సీడే నిర్వహించారు. న్యూరాలజీ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని జిమ్సర్ ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ప్రారంభించారు. గీతం న్యూరాలజీ నిపుణుడు డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 50 మిలియన్ల జనాభా మూర్ఛ రోగంతో బాధపడుతున్నారని, వారిలో 80 శాతం మంది అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉన్నారన్నారు. మన దేశంలో 10 మిలియన్ల జనాభా మూర్ఛ రోగంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూర్ఛ రోగం ఉన్నవారికి పూర్తి వివరాలతో ముద్రించిన ప్రత్యేక కార్డులను అందజేస్తున్నామన్నారు. తద్వారా వారు ఆరుబయట పడిపోతే ఎవరైనా సాయపడే అవకాశం ఉందన్నారు. రోగి కుటుంబ సభ్యులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిమ్సర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ, ఆసుపత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ రామాజనేయలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ విఠల్, న్యూరాలజీ సీనియర్ డాక్టర్‌లు డాక్టర్ శిల్పా, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు. మూర్ఛ రోగులకు ఉచితంగా మందులు కిట్‌లు అందజేసారు.

ఔషధ ప్రయోగాలకు ప్రత్యామ్నాయం అవసరం

అంతర్జాతీయ సదస్సులో గీతం విసి ప్రొఫెసర్ దయానంద

ప్రజాశక్తి- మధురవాడ: పరిశోధించిన ఔషధాల ప్రయోగ ఫలితాలకు జంతువులపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయం చూడాల్సిన అవసరం ఉందనిగీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం అన్నారు. నైతిక అంశాలకు తోడు చట్టాలకు లోబడి ప్రయోగాలను చేయాల్సిన పరిస్థితుల్లో జాప్యం జరగకుండా ఉండాలంటేఇది అవసరమన్నారు.గురువారం గీతం విశ్వవిద్యాలయం వేదికగా ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్, వ్యాస్ కేన్సర్ రీసెర్చ్ పార్క్, ఎకాస్టా హెల్త్ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అడ్వాన్సెస్ ఇన్ యానిమల్ మోడల్స్ అండ్ కటింగ్ ఎడ్జ్ రీసెర్చ్ ఇన్ ఆల్టర్‌నేటివ్స్' అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తొలినాళ్లలో యాంటీ బయోటిక్ ఔషధాలకు పాశ్చాత్య దేశాలపై ఆధారపడే భారత్, నేడు పది శాతం ఔషదాలను, ఐదు శాతం వ్యాక్సిన్లను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తోందన్నారు. అయినా నేటికీ కేన్సర్‌తోపాటు అనేక వ్యాధులకు ఔషధాలను కనిపెట్టాల్సి ఉందన్నారు. దేశంలోని ఔషధ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, విద్యాలయాలలోని మేధావులు సమిష్టిగా కృషితో ఇది సాకారమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న మూడేళ్లలో గీతంలోని ప్రయోగశాలలను పరిశోధనలకు అనువుగా రూ.40 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. . గీతం సైన్స్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ ఎమ్.బాలకుమార్, ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ ఎగ్జిక్యూటీవ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రెడ్డన్న, వ్యాస్ కేన్సర్ రీసెర్చ్ పార్క్ సిఇఒ డాక్టర్ మందర్ కులకర్ణి, సదస్సు నిర్వహక అధ్యక్షుడు డాక్టర్ సురేష్ పూసల మాట్లాడారు. కార్యక్రమంలో ఎరెజెన్ లైఫ్ సైన్సెస్ ఉపాధ్యాక్షురాలు డాక్టర్ ప్రతిమా శ్రీవాత్సవ, డాక్టర్ భరద్వాజ పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో కార్మిక సమస్యలు పరిష్కారం

సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్



మాట్లాడుతున్న సిఐటియు నేత చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-అరకులోయ : కార్మికులు అందరూ ఒకే తాటిపైకి వచ్చి ఐక్య ఉద్యమం చేపట్టడం ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతుందని అల్లూరి సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. అరకులోని గిరిజన సంఘం భవనంలో సిఐటియు 6వ మహాసభ ఆ సంఘం నేత మల్లేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తూ మార్చేస్తున్నాయన్నారు.సంఘం పెట్టుకునే హక్కులు కూడా బిజెపి ప్రభుత్వం హరిస్తుందని ఆయన విమర్శించారు. అంగన్వాడి, ఆశ, మిడే మీల్స్, విద్యుత్, టూరిజం, జిసిసి, ఆసుపత్రి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఒకపక్క పర్మినెంటు చేయకపోగా, మరోపక్క ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్ ప్లాంట్, రైల్వే, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్ వంటివి ప్రైవేటు పరం చేస్తూ విక్రయిస్తున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు ఐక్య ఉద్యమాలు చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలోనే కార్మిక చట్టాలు ఉల్లంగించబడుతుందని, కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ఒడిశాలో 57 వేల మంది కార్మికులను పర్మినెంట్ చేసిందని ఆయన సందర్భంగా అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఉన్న ఉద్యోగాలను తగ్గించే పనిలో పడిందన్నారు. ఉద్యమాన్ని పోలీసుల సహాయంతో ఉక్కుపాదంతో అణిచి వేస్తుందని, 44 రకాల కార్మిక చట్టాలను కోడ్లుగా చేయడం దారుణమన్నారు.కేంద్ర లో బిజెపి, రాష్ట్రంలో వైసీపి ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని విమర్శించారు. నూతన అటవీ విధానంతో గిరిజనులను అడవి నుంచి గెంటివేసే ప్రయత్నం చేస్తుందన్నారు పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోరాటాలకు అరకు పురిటి గెడ్డ

సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కార్మిక పోరాటాలకు అరకు పురిటి గెడ్డ అని, అదే స్ఫూర్తితో కొత్తగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల్లో రాజకీయ చైతన్యం కావాలని, పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. కనీస వేతనాల కోసం ఉద్యమించాలని, ధరలు పెరిగినా కార్మికుల వేతనాలు పెరగడం లేదన్నారు. కార్మికులతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం కూడా కూలి పోక తప్పదని ఆయన అన్నారు.

అవిశ్రాంతంగా కృషి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్ మాట్లాడుతూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు అవిశ్రాంతంగా కషి చేస్తుందన్నారు.గిరిజన ప్రాంతంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, మెడికల్ అండ్ హెల్త్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, వీఆర్ఏ, వివోఏలకు పని భద్రత కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో విస్తారంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు, పెయింటింగ్, విద్యుత్, కార్మికులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ ఇచ్చి పని భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, భవన నిర్మాణ సంఘం నాయకులు ప్రభుదాస్, కొండలరావు, వీవోఏల సంఘం నాయకులు సత్యవతి, హెూటల్స్, లాడ్జి రెస్టారెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మగ్గన్న, జిసిసి సబ్బుల ఫ్యాక్టరీ కార్మిక సంఘం యూనియన్ నాయకుడు సింహాద్రి, హెచ్ఎన్‌టిసి, మ్యూజియం కార్మిక నాయకులు డి.రాజు, డొంబు, విఆర్ఓ సంఘం జిల్లా నాయకులు నరాజీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మైమరపించిన 'మాడగడ'

పాల సముద్రంలా పొగమంచు కనువిందు


మాడగడలో నేలపై పరుచుకున్న పొగమంచు అందాలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని బస్కీ రహదారి వెళ్ళే రోడ్డు మార్గంలో మాడగడ కొండ పాల సముద్రంలా అందాలను కనువిందు చేస్తున్నాయి. ఆంధ్రా ఊటీ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తు వచ్చేది అరకులోయ. చల్లటి వాతావరణం, ఎత్తైన కొండలు, జలపాతాలు, శీతాకాలం వచ్చిందంటే చాలు అందమైన ప్రకృతి సుందర దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. ప్రకృతి సోయగాలను పులకిస్తూ పర్యాటకలను ఆకర్షిస్తుంటాయి.

అరకులోయలో మరో ప్రకృతి రమణీయ ప్రదేశం ఇప్పుడు కొత్తగా వెలుగులోకి వచ్చింది. కొండల మధ్య పాల సముద్రాన్ని తలపించేలా మాడగడలో ప్రకృతి సోయగం కనువిందు చేస్తోంది. భూతల స్వర్గాన్ని తలపించే మాడగడ ప్రకృతి సోయగం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. కొండల మధ్య పాల సముద్రం మాదిరిగా కమ్మిన మంచు మేఘాలు కనువిందు చేస్తున్నాయి. ఉదయాన్నే 5 గంటల సమయంలో పర్యాటకులు అక్కడకి వెళ్లి చల్లికి కట్టెలతో మంటలు పెట్టీ అగ్గి కాస్తుంటారు. సూర్యోదయాన్నే లేలేత కిరణాలు ఆ మంచు మేఘాలను తాకితే వెండి వర్ణంలో తల తల మెరిసిపోతోంది. ఆ ప్రాంతం.

తాజాగా ఆంధ్రా ఊటీ అరకులోయ పరిసర ప్రాంతంలో బయటపడిన ఈ మాడగడ వ్యూ పాయింట్ పర్యాటకులను ఆకర్షిస్తుంది. అరకులోయ మండల కేంద్రానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ వ్యూ పాయింట్ కి చేరుకోవాలంటే అరకులోయ నుండి బస్కి వెళ్ళే రోడ్డు మార్గంలో ప్రయానించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు వంజంగి, లంబసింగి అందాలను చూసి పర్యాటకులు ఔరా అనేవారు. పాల కడలిలా ఉండే మంచు మేఘాల అందాలను చూసేందుకు పర్యాటకులు, స్థానికులు క్యూ కడుతున్నారు.

తాజాగా వెలుగులోకి వచ్చిన మాడగడ ప్రాంతంలోని ఈ అద్భుత ప్రకృతి దశ్యాలు వాటికి తలదన్నేలా ఆకర్షిస్తున్నాయి. కొండల మధ్య మంచు అందాలను కెమెరాల్లో బందిస్తూ ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు. మాడగడ కొండ ప్రాంతాన్ని మరింతగా ఐటిడిఏ అధికారులు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి చూపండి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఎపి అధ్యక్షుడు గడుతూరి రామగోపాల్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల వివిధ విభాగాల్లో నోటిఫికేషన్లు వెలువడినప్పటికీ గిరిజన ప్రాంతాల్లోని నిరుద్యోగులు ఆర్థికంగా సతమతమవుతున్నారని, పోటీపరీక్షలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్థోమత లేక పోవడంతో పోటీ పరీక్షల్లో వారంతా విఫలమవుతున్నారన్నారు. ప్రభుత్వం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు, విశాఖ ప్రాంతాల్లో గిరిజన నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జాబ్ మేళాలు నిర్వహిస్తున్న విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు అవసరమయ్యే శిక్షణలు గిరిజన యువతకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

కోర్టు కేసుల విచారణ వాయిదా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో ఈ నెల 18న నిర్వహించాల్సిన కోర్టు కేసుల విచారణ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు కేసులు విచారణ తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియ జేస్తామని పేర్కొన్నారు.

గలగండలో గడపగడపకూ ఎమ్మెల్యే


వృద్ధునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని గలగండ పంచాయతీలో గురువారం అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం లో భాగంగా పర్యటించారు. 135 గడపలను సందర్శించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ కె.బొంజుబాబు, స్థానిక సర్పంచ్ పూజారి లోహిదాసు, కుంతుర్ల సర్పంచ్ చిన్నారావు, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కాతారీ సురేష్ పాల్గొన్నారు

వీధి దీపాల ఏర్పాటు


వీధి లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: విద్యుత్ లైట్ల ఏర్పాటుపై పోతంగి మేజర్ పంచాయతీ సర్పంచ్ వెంకటరావు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన దుంబ్రిగుడలోని ప్రధాన రహదారికి ఇరువైపులా విద్యుత్ లైట్ల ఏర్పాటుపై గురువారం సర్పంచ్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. స్థానిక విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో వీధిలైట్లను అమర్చారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : గ్రంధాలయ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోసోమ్‌గుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీతల విలియం కేరి కోరారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ, పుస్తకాల ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు.



గిరిజన కళాకారులతో అతిథులు

సందడిగా గిరిజన సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భారత గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో తలపెట్టిన గిరిజన గౌరవ దినోత్సవ సంబరాలు మూడో రోజైన గురువారమూ ఉత్సాహంగా సాగాయి. సీతంపేట, పార్వతీపురం, పాడేరు, చింతూరు, కెఆర్.పురం, నెల్లూరు, శ్రీశైలం ప్రాంతాల్లోని గిరిజన కళాకారులు నృత్య రూపాలను ప్రదర్శించారు. వారికి అతిథులు ప్రశంసా పత్రాలను అందజేశారు. గిరిజన కళాకారులు తయారుచేసిన వస్తువులు స్టాల్స్‌లో కొలువుదీరి అందరినీ ఆకట్టుకున్నాయి. మూడో రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.సత్యపాల్, డాక్టర్ రమేష్, గీతం విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రగ్యా, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రపంచ మత్స్యకార వేడుకలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఈ నెల 20, 21 తేదీలలో తమ సంఘం ఆధ్వర్యంలో ఆర్‌కె.బీచ్‌లో నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లిపల్లి ఎల్లాజీ తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20న ఉదయం 10 గంటలకు బీచ్ సీ పెరల్ వేదిక వద్ద 'ఆంధ్రా కవాలి' పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 21న సాయంత్రం 5 గంటలకు దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సారథ్యంలో మత్స్యకారుల కుటుంబాలకు చీరలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. 8 వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కేరళ, ఒడిశా వంటి రాష్ట్రాల్లో వలే స్థానిక మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు. మత్స్యకార కుటుంబంలో ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. మీడియా సమావేశంలో సురపతి అప్పలరాజు, సురపతి అప్పన్న, ఉమ్మిడి అప్పలరాజు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇపిఎస్ పెన్షన్‌దారుల సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 7, 8 తేదీల్లో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఎపిఎస్ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పడి 22 ఏళ్లు అయిన సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యాన మద్దిలపాలెం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద సంఘం జెండావిష్కరణ చేపట్టారు. కోర్కెల దినం పాటించారు. తొలుత సంఘం సీనియర్ నాయకులు బివి.రమణ జెండాను ఆవిష్కరించగా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.తులసీరాం, ఇపిఎస్ 95 ఆల్ పెన్షనర్స్ రిటైర్ట్ అసోసియేషన్ నాయకులు కెఎం.కుమార్‌మంగళం మాట్లాడారు. ఆర్‌టిసిలో రిటైర్ అయిన 40 వేల మంది ఇపిఎస్ - 95 పెన్షన్ స్కీంలో ఉండిపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఉద్యమిస్తున్నా నేటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.9 వేలు ఉండాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ దానిని కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.600 - రూ.2100 పెన్షన్ వైద్య ఖర్చులకు సైతం సరిపోవడం లేదన్నారు. ఆర్‌టిసిలో ప్రస్తుతం అమలు జరుగుతున్న ఎస్‌ఆర్‌బిఎస్, మెడికల్ స్కీం, ఆర్‌టిసి బస్సుల్లో ఫ్రీట్రావెల్ గుర్తింపు కార్డులను కొనసాగిస్తూ, హైటెక్ బస్సులలో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కెపి.కుమార్, వైఎం.రావు, ఎస్ఎస్.రాజు, బి.శంకరరావు, తాజుద్దీన్, మోహన్‌రాజు, ఎస్‌బి.బాబు పాల్గొన్నారు.

అడ్డగోలు నిర్మాణాలు

గతంలో ప్లాన్‌లు చూడకుండానే జివిఎంసి అనుమతులు
ఎండాడ క్వారీ సర్వే నెంబర్ 1లో 109 అక్రమ కట్టడాలు
రుషికొండ - స్వర్ణభారత్ నగర్ ప్రాంతాల్లో 300 అక్రమ ప్లాట్లు
కమిషనర్ దృష్టిసారిస్తారా ?


స్వర్ణభారత్ నగర్‌లోని ఓ అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వ స్థలాలు, కొండలను తవ్వేసి చేపట్టిన అక్రమ నిర్మాణాల వ్యవహారాలు విశాఖ నగరంలోని మధురవాడ జోన్ పరిధిలో కోకొల్లలు. జివిఎంసి అధికారులు గతంలో ప్లాన్‌లు చూడకుండా ఇచ్చిన అనుమతుల కారణంగా అక్రమ కట్టడాలతో కబ్జారాయుళ్లు రూ.కోట్లకు పడగలెత్తారు. ఈ అడ్డగోలు కట్టడాలపై జివిఎంసి నూతన కమిషనర్ పి.రాజాబాబు దృష్టి సారించాలని ఎండాడ, రుషికొండకు చెందిన పలువురు భావిస్తున్నారు. జివిఎంసి నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై 'స్క్వాడ్' ద్వారా తనిఖీలు చేయించేందుకు జివిఎంసి సిద్ధమవుతున్న తరుణంలో అసెస్‌మెంట్లు వేసినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని, కూకటివేళ్లతో అక్రమ కట్టడాలపై కొరడా ఝుళిపించాల్సిందేనని స్థానికులు కోరుతున్నారు.

అక్రమార్కుల గుప్పెట్లో రూ.వందల కోట్ల స్థలాలు

రుషికొండ-స్వర్ణభారతి నగర్ ప్రభుత్వ లే అవుట్‌నే ఏకంగా ఓ ప్రబుద్ధుడు కబ్జా చేశాడు. రుషికొండ సర్వే నెంబరు 17/1, 2, 5లలో రెండు దఫాలుగా ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఇడబ్ల్యుఎస్) వారికి సుమారు 400 పట్టాలను ప్రభుత్వం ఇచ్చింది. ఒక్కో లే అవుట్‌కు 60 చదరపు గజాల్లో అనుమతులిచ్చింది. అయితే అక్కడ ఓపెన్ స్థలాలు, ప్రజాప్రయోజనాలకు కేటాయించిన పార్కు ఎకరన్నర స్థలంలో మరో 300 అక్రమ ప్లాట్లు వేసేశారు. 3 నుంచి 4 అంతస్తుల భవంతులను అక్రమంగా చెన్నా దాసు అనే వ్యక్తి నిర్మించేశాడు. ఇడబ్ల్యుఎస్ లే అవుట్ సర్వే నెంబరు 17/1, 2, 5 ఎల్‌పి నెంబరు 3/2004లోగల పబ్లిక్ పర్పస్, ఓపెన్ స్పేస్, రోడ్లకు నకిలీ పత్రాలను జివిఎంసికి చూపించి ఇలా వాణిజ్య భవనాలను ప్రభుత్వ స్థలంలో కట్టేశారు. ఇది ఎలా జరిగిందంటే?.. ప్రభుత్వం ఇచ్చిన 400 పట్టాల నెంబర్లనే ఆక్రమించిన ఈ స్థలాలకు చెన్నాదాస్ చూపించడం, జివిఎంసి అధికారులు అనుమతులివ్వడం చకచకా జరిగిపోయాయి. ఈ డాక్యుమెంట్లను జివిఎంసి తనిఖీ చేయకుండా గుడ్డిగా వ్యవహరించడంతో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకోర్ల చేతుల్లోనే ఉండిపోయాయి. ఇక్కడ నిర్మించిన అక్రమ కట్టడాలపై జివిఎంసి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ నేడు సర్వత్రా వినిపిస్తోంది.

ఎండాడ సర్వే నెంబరు1లో భూ దందాలు

ఎండాడ సర్వే నెంబరు 1 క్వారీ కొండపై భూ రాబందుల ముఠా చేరి ప్రజా ఆస్తులను కొల్లగొట్టింది. గతంలో ఈ కొండపై క్వారీని ప్రభుత్వం ఆపేయగా స్థానికులు కొంతమంది చేరి 200 ప్లాట్లను 15 వరుసల్లో లే అవుట్‌లు వేసి అక్రమంగా అమ్మేసుకున్నారు. గతంలో జాయింట్ కలెక్టర్ నివాస్‌కు ఫిర్యాదులు వెల్లడంతో స్పందించి కొన్ని నిర్మాణాలను జెసిబితో తొలగించారు.

ఆనాడు తెలుగుదేశం అధికారంలో ఉండడంతో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దీనికి అడ్డుతగిలి తొలగించవద్దని హుకుం జారీచేశారు. ప్రస్తుతం 6 లైన్లు, 109 ప్లాట్లు ఉన్నాయి. వీటికి దుర్గానగర్ అని పేరుపెట్టి అక్రమంగా రోడ్ల నిర్మాణాలు చేసి, అమృతపథకంలో పైపులు కూడా జివిఎంసి వేయించింది. పై 109 ప్లాట్లలో 9 ఖాళీగా ఉండగా 35కు గతంలో పట్టాలు రప్పించారు. 75కు పట్టాల్లేవు. కేవలం రేకుల షెడ్లు వేశారు. ఈ వ్యవహారం కోర్టులో ఉంది. జివిఎంసి సరైన రీతిలో వ్యవహరించకుండా అక్రమార్కులపై మెతకగా ఉండడంతో విషయం ముదిరింది. పరిష్కరించాల్సిన బాద్యత జివిఎంసిదే.

'ఉక్కు' పరిరక్షణకు 22న భారీ నిరసన దీక్ష



అభివాదం చేస్తున్న జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు, నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరసన దీక్షలు ఈ నెల 22కు 600 రోజులకు చేరుతున్న సందర్భంగా ఆ రోజున మోడీ ప్రభుత్వానికి పెద్దఎత్తున నిరసన తెలియజేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జెఎసి సమావేశం జరిగింది. సమావేశానికి జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెల 11, 12 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ విశాఖలో పర్యటించారని, ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపుతామని ప్రకటన చేస్తారని అంతా భావించామని అన్నారు. కానీ విశాఖ, ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు మోడీ తీవ్ర నిరాశను మిగిల్చారని ఆవేదన వెలిబుచ్చారు. స్టీల్‌ప్లాంట్, విభజన చట్టం హామీలు అమలుపై ఏ విధమైన ప్రకటనా చేయకపోవడం అన్యాయమన్నారు. మోడీ రాక సందర్భంగా వందలాది మంది కార్యకర్తలను, నాయకులను గృహ నిర్బంధం, ముందుస్తు అరెస్టులు చేయడాన్ని జెఎసిగా ఖండిస్తున్నామన్నారు. మోడీ స్టీల్‌ప్లాంట్‌పై మాట్లాడకపోవడంపై ఈ నెల 22న జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. మోడీ విశాఖ పర్యటన అనంతరం తెలంగాణాలో సింగరేణి గనులను ప్రయివేటుపరం చేయబోమని ప్రకటించడం చూస్తే, ఇది పూర్తిగా రాజకీయ దురుద్ధేశంతోనే జరిగిందన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు, కార్మికులు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి వైస్ ఛైర్మన్లు పడాల రమణ, భోగవిల్లి నాగభూషణం, కన్వీనర్లు వై.మస్తానప్ప, వై.కొండయ్యతోపాటు జెఎసి నాయకులు ఎంఎస్.కృష్ణ, పి.వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎం.మన్మధరావు, ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, రైతు సంఘం నాయకులు జి.నాయినబాబు, ఐఎన్‌టియుసి కార్యదర్శి కె.ఈశ్వరరావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు ఎస్.చంద్రశేఖర్, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల ప్రవేశ రుసుము పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విఎంఆర్‌డిఎ పరిధిలో ఉన్న కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం, కైలాసగిరి హిల్ పార్క్, హెల్త్ ఎరీనాల ప్రవేశ రుసుము, హెల్త్ ఎరీనా వాకర్స్ చందా రుసుము, తెన్నేటి పార్క్‌లో కార్ పార్కింగ్ రుసుములను పెంచుతున్నట్టు విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎ.మల్లికార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం ప్రవేశ రుసుము పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20, స్కూల్ పిల్లలకు (గ్రూపు) రూ.10 ఉండగా కొత్త ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.70, పిల్లలకు రూ.40, స్కూల్ పిల్లలకు (గ్రూపు) రూ.20 వసూలు చేయనున్నారు. కైలాసగిరి హిల్ పార్కు ప్రస్తుత ప్రవేశ రుసుము పెద్దలకు రూ.5 ఉండగా రూ.10గా మారింది. హెల్త్ ఎరీనాకు ఇప్పటివరకు ఎటువంటి రుసుమూ విధించలేదు. తాజాగా పెద్దలకు రూ.10ని ప్రవేశ రుసుముగా వసూలు చేయనున్నారు. హెల్త్ ఎరీనా డైలీ వాకర్స్ నెలసరి చందా రూ.50, సంవత్సర చందా రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. తెన్నేటి పార్కు వద్ద ఒక కారు మూడు గంటల పార్కింగ్‌నకు రూ:10 వసూలు చేయనున్నారు. టియు - 142 మ్యూజియంలో వీడియో కెమెరా అనుమతి కోసం టికెట్ ధరను రూ.200గా నిర్ధారించారు. ఈ ధరలన్నీ డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

'విశ్వకర్మ'ను సందర్శించిన ఎపిపిపిఎ అధికారులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : 48వ అడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎపిపిపిఎ) అధికారులు ఐఎన్ఎస్ విశ్వకర్మను సందర్శించారు. నేవల్ ఆర్కిటెక్చర్ విభాగంలోని హల్ మెయింటెనెన్స్‌ను, శిక్షణ తీరును తెలుసుకున్నారు. డ్యామేజ్ కంట్రోల్ ట్రైనింగ్ ఫెసిలిటీలో ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించారు. వృత్తిపరమైన అనుభవాలను పంచుకున్నారు.

ముగిసిన సీ విజిల్ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సముద్రంలో యుద్ధ సమయంలోనూ, దేశంలోని తీరప్రాంతంలో ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనే సమయంలోనూ చేపట్టాల్సిన చర్యలపై తలపెట్టిన కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్ సీ విజిల్ - 22 బుధవారం రాత్రితో ముగిసింది. కోస్తా తీర భద్రతలో పాలుపంచుకున్న తొమ్మిది తీర రాష్ట్రాలు, నాలుగు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 17 ప్రభుత్వ ఏజెన్సీలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్, స్టేట్స్ మెరైన్, కోస్టల్ పోలీస్, కస్టమ్స్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, పోర్టు అథారిటీలు, ప్రైవేట్ ఆపరేటర్లు భాగస్వాములయ్యారు.

వివేక్ ఎక్స్‌ప్రెస్ సేవలు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 15906/15905 దిబ్రుఘర్ - కన్యాకుమారి - దిబ్రుఘర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీని వీక్లీ నుంచి బై వీక్లీకి పెంచాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 15906 దిబ్రుఘర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 22 నుంచి ప్రతి మంగళ, శనివారాలలో దిబ్రుఘర్ నుంచి బయలుదేరుతుంది. అదేవిధంగా 15905 కన్యాకుమారి - దిబ్రుఘర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి ప్రతి ఆది, గురువారాల్లో కన్యాకుమారి నుంచి బయలుదేరుతుంది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే శాఖాధికారి త్రిపాఠి కోరారు.

హెచ్‌పిసిఎల్ ఆస్తి పన్ను బకాయి చెల్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌పిసిఎల్ సంస్థ చెల్లించవలసిన ఆస్తి పన్ను బకాయికి సంబంధించి రూ.కోటి చెక్కును అందజేసినట్లు జివిఎంసి కమిషనర్ పి.రాజా బాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఆస్తి పన్నుల బకాయిలను జివిఎంసికి చెల్లించి నగారాభివృద్ధికి సహకరించాలని కోరారు.

క్రిస్టియన్ మిషనరీ భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చాక కాకినాడ నుండి శ్రీకాకుళం వరకు సుమారు రూ.2 లక్షల కోట్ల విలువ చేసే క్రిస్టియన్ మిషనరీ భూములకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి క్రిస్టియన్ విభాగం విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు ఉరుకూటి డేవిడ్ ఆరోపించారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. గురువారం ఆమె 16వ వార్డు పరిధిలోని కెఆర్ఎం.కాలనీ, రజక వీధిలలో జివిఎంసి నిధులు రూ.54 లక్షలతో తారు రోడ్ల నిర్మాణానికి విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మితో కలిసి శంకుస్థాపన చేశారు